క్లుప్తంగా

షాద్‌నగర్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జిగా లష్కర్‌నాయక్



షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీజేపీ షాద్‌నగర్ ఎన్నికల ఇన్‌చార్జిగా పాత్లావత్ లష్కర్‌నాయక్‌ను మంగళవారం నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన సేవలకు గుర్తింపుగా పార్టీ అధిష్టానం ఇన్‌చార్జిగా నియమించడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు.

ఈటలను కలిసిన పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి



ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను మంగళవారం పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి వెళ్లిన విష్ణువర్ధన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఉన్న ఈటల రాజేందర్‌ను కలిసి శాలువా కప్పి సన్మానించారు. లోక్‌సభ ఎన్నికల్లో పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపునకు అందరూ కృషి చేయాలని విష్ణువర్ధన్‌రెడ్డికి ఆయన సూచించారు.

ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నందిగామ: నిబంధనలకు విరుద్ధంగా తరగతులను కొనసాగిస్తున్న విద్యాసంస్థలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారం సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన నందిగామలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని పట్టణ, మండల కేంద్రాల్లో సెలవు దినాలలో తరగతులను కొనసాగిస్తున్న విద్యాసంస్థలపై నిఘా పెట్టి వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా సంవత్సరం మొదలు కాకముందే ఫీజుల దోపిడి ప్రారంభించారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే పలు విద్యాసంస్థలు అడ్మిషన్లు ప్రారంభించి డొనేషన్ల రూపంలో వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తుక్కుగూడ: రావిర్యాల సూర్యగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉత్సవాల్లో భాగంగా ఆలయంలోని లక్ష్మీనర్సింహస్వామి, ఆంజనేయస్వామి విగ్రహాలతో పాటు శివుడికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో యజ్ఞాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, కౌన్సిలర్ సుమన్, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో పురాతన అభయాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి మాజీ సర్పంచ్, మాజీ కౌన్సిలర్ యెల్చెల మమతసుదర్శన్‌రెడ్డి రూ.2.11లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయాభివృద్ధికి సహరిస్తామన్నారు. దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మర్రి నరసింహారెడ్డి, బండి స్వామియాదవ్, తిరుపల్లి సుధాకర్‌యాదవ్, కోటగిరి జంగయ్య, అంకంగారి శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కవోని దీక్ష

హరితహారం కోసం గ్రామాల్లో మొక్కల పెంపకం

- నర్సరీల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
- 28 గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న పనులు

మొయినాబాద్‌రూరల్: ఆకుపచ్చని తెలంగాణ కోసం రాష్ట్ర ప్రభుత్వం హరితహారానికి శ్రీకారం చుట్టింది. ఏటా లక్షలాది మొక్కలు నాటుతూ అడవుల శాతాన్ని పెంచుతోంది. అయితే ప్రతి సీజన్‌లో మొక్కలు కావాలంటే ఇతర ప్రాంతాల నుంచి తెప్పించుకోవాల్సి వచ్చేది. అది కూడా ముందస్తుగా సమాచారం ఇస్తే గానీ దొరక్కపోయేవి. ఫలితంగా లక్ష్యం నెరవేరకపోయేది. ఇలాంటి పరిస్థితులను గుర్తించిన ప్రభుత్వం దూరదృష్టితో పల్లె, పట్టణాల్లో నర్సరీలు ఏర్పాటు చేసుకోవాలని గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గ్రామ పంచాయతీలు, పట్టణాల్లో ప్రత్యేక నిధులతో నర్సరీలు ఏర్పాటయ్యాయి. ఆయా పంచాయతీ, పట్టణం లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు పెంచుతున్నారు. నర్సరీల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మొక్కలకు ఎండ బారి నుంచి రక్షణ కోసం షేడ్ నెట్లను అమర్చారు.

ప్రత్యేక చర్యలు..

మండల పరిధిలోని 28 గ్రామాల్లో ప్రభుత్వ లక్ష్యం మేరకు 2.80లక్షల మొక్కలు పెంచుతున్నారు. ఈ నర్సరీలలో మొక్కలకు ఎండ బారి నుంచి రక్షణ కోసం షేడ్ నెట్లను అమర్చారు. జూన్ మాసం నాటికి మొక్కలను సిద్ధంగా ఉంచేందుకు అధికారులు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా ఎవెన్యూ ప్లాంటేషన్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగా రోడ్లకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్నారు.

30 రకాలు..

ఆయా నర్సరీల్లో అధికారులు రకరకాల మొక్కలు పెంచుతున్నారు. పండ్లు, పూలు, నీడనిచ్చే సుమారు 30 రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. జామ, అల్లనేరేడు, చక్రమల్లె, మందారం, నేరేడు, మల్లె, చామంతి, గన్నేరు, గులాబీ, దానిమ్మ, కానుగ, పారిజాతం, సీతాఫలం, వివిధ రకాల పండ్ల మొక్కలను పెంచుతున్నారు. రకరకాల మొక్కలతో నర్సరీలు పచ్చదనం పరుచుకొని చిట్టడవిని తలపిస్తున్నాయి.



నర్సరీలో పెంచుతున్న మొక్కలు

అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం



గ్రామాల్లోని నర్సరీలలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా నర్సరీపై గ్రీన్ షేడ్ నెట్‌లను ఏర్పాటు చేయించాం. ఎండాకాలంలో మొక్కలు ఎండిపోకుండా రెండు పూటల నీరు పట్టిస్తున్నాం. వచ్చే విడత హరితహారం కార్యక్రమంలో మొయినాబాద్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ఆయా గ్రామాల అధికారులతో ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

– సంధ్య, ఎంపీడీఓ, మొయినాబాద్

లక్ష్యం మేరకు పెంచుతున్నాం



లక్ష్యం మేరకు పెంచుతున్నాం. వచ్చే హరితహార కార్యక్రమానికి కేతిరెడ్డిపల్లి గ్రామంలో గల నర్సరీలో పదివేల మొక్కల వరకు విత్తనాలు నాటి పెంచుతున్నాం. అధికారుల సూచనల మేరకు ప్రణాళిక సిద్ధం చేసుకొని వచ్చే వర్షాకాలానికి ప్రజలకు కావాల్సిన మొక్కలు అందుబాటులో ఉండేలా పెంచుతున్నాము. ప్రతిరోజు నీరు అందిస్తున్నాం.

– తారాబాయి, పంచాయతీ కార్యదర్శి, కేతిరెడ్డిపల్లి



కేతిరెడ్డిపల్లి నర్సరీలో మొక్కలకు నీరు పట్టిస్తున్న పంచాయతీ కార్యదర్శి తారాబాయి(ఫైల్)

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మండల పరిధిలోని మీరాపూర్ దర్గాలో చెన్నబాయి మైనార్టీలకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ఐకమత్యానికి, మత సామరస్యానికి చిహ్నంగా నిలుస్తాయన్నారు. సర్వమత సారం ఒక్కటేనని, మానవులంతా సోదరభావంతో ఉండాలని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కావలి చంద్రశేకర్, షాబాద్ దర్శన్, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే శంకర్, మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



కలశ పూజలో భక్తులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని రుద్రారం మాజీ సర్పంచ్ బండ స్వర్ణలతసతీశ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గుర్రాల విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, స్థాపిత దేవతా ఆహ్వానం, జలాధివాసం, అవధాన సేవ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోట్ల జయమ్మ, బాల్‌రెడ్డి, రమేశ్, సంజీవరెడ్డి, సంపత్‌రెడ్డి, కృష్ణ, నర్సింలు, శేఖర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, మధు, మాణిక్యం, ఉపేందర్‌రెడ్డి, శివకుమార్, అల్లవాడ బాలయ్య, రవి, గ్రామస్తులు తదితరులున్నారు.

పాపన్నగౌడ్ అందరికీ స్ఫూర్తిదాయకం



నివాళులర్పిస్తున్న గౌడ సంఘం సభ్యులు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చేవెళ్ల: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన సేవలు స్ఫూర్తిదాయకమని గౌడ సంఘం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 314వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహం వద్ద వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు పాపన్నగౌడ్ చేసిన సేవలు, పోరాటాలను గుర్తు చేసుకున్నారు. మహనీయుల మార్గాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని, వారు చూపించిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు ప్రకాశ్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాముగౌడ్, నాగారాజు, రాజు, దయానంద్, నరేందర్, సుబుద్ధి, ఆంజనేయులు, వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు వీరేందర్‌రెడ్డి, వసంతం, రాములు, మల్లేశ్, ప్రభాకర్, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్, రాములు, దేవేందర్ తదితరులు ఉన్నారు.

లేఅవుట్ ధ్వంసంపై ఫిర్యాదు



మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీడీఎస్ అసోసియేషన్ సభ్యులు

చేవెళ్ల: బీడీఎల్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులకు సంబంధించిన లేఅవుట్‌ను ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అసోషియేషన్ సభ్యులు, ప్లాట్ల యజమానులు డిమాండ్ చేశారు. శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు మంగళవారం వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శంకర్‌పల్లిలోని సర్వే నెంబర్లు 208 నుంచి 213 వరకు, 242, 243 సర్వే నెంబర్లలో 18 ఎకరాల 38 గుంటల భూమిని 2011 సంవత్సరంలో బీడీఎల్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందులో 2013వ సంవత్సరంలో హెచ్ఎండీఏ నుంచి అనుమతి పొంది లేఅవుట్ చేసినట్లు చెప్పారు. లేఅవుట్ చేసిన కొన్ని సంవత్సరాల తరువాత సర్వే నెంబర్ 242 పార్ట్‌లోని మూడు ఎకరాల భూమి తనది అంటూ బీడీఎల్ వెల్ఫేర్ అసోషియేషన్‌కు సంబంధం లేని వ్యక్తులు వచ్చి తమను ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. ఈనెల 1వ తేదీన తోట శ్రీనివాస్‌రెడ్డి అతని అనుచరులతో లేఅవుట్‌లో గల పార్కు స్థలం, డ్రైనేజీ పైపులు, ప్లాట్ చుట్టూ నిర్మించిన ప్రహరీ, బీటీరోడ్లను జేసీబీ సాయంతో ధ్వంసం చేసినట్లు చెప్పారు. అంతేకాకుండా ప్లాట్ల చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు ప్రయత్నిస్తుండగా మాకు తెలియడంతో పోలీసుల సాయంతో వెళ్లి అడ్డుకున్నామన్నారు. ఆ వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

బడంగ్‌పేట్: చలి వేంద్రాలు ప్రజల దాహార్తిని తీరుస్తాయని మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని పాత గ్రామ పంచాయతీ సర్కిల్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద లైఫ్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, బాలకృష్ణ, నిర్వాహకులు మహేశ్‌రెడ్డి, ఆనంద్, అకాస్ మెడికల్స్ నిర్వాహకులు పసునూరు సత్యనారాయణ, మురళీ, కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ నిర్లక్ష్యంతోనే కరువు'

కడ్తాల్: పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కరువుకు కారణమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యాలను కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టేందుకు, మాజీ ముఖ్యమంత్రి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ కుట్రలు పన్నుతున్నారని ప్రజలు ఏ మాత్రం విశ్వసించరని పేర్కొన్నారు. అధికారం కోల్పోయాక కేసీఆర్‌కు రైతుల బాధలు గుర్తొస్తున్నాయని ఎద్దేవా చేశారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన బీఆర్‌ఎస్ త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు సాగిస్తున్న ఎత్తుగడలను, డ్రామాలను ప్రజలు విశ్వసించరని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలు ఎన్ని కుట్రలు పన్నినా కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 6న జాతీయ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గ్యారంటీలను ప్రకటించనున్న నేపథ్యంలో నిర్వహించనున్న తుక్కుగూడ జనజాతర శంఖారావ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు వేల సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజ్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, కృష్ణనాయక్ పాల్గొన్నారు.

ఓటు హక్కు అందరి బాధ్యత



చేవెళ్ల: మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు

ఆర్డీఓ వెంకట మాధవరావు

షాద్‌నగర్: ఓటు హక్కు అందరి బాధ్యత అని ఆర్డీఓ వెంకట మాధవరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని మినీ స్టేడియం నుంచి ముఖ్య కూడలి వరకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా 5కే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీఓ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం సజావుగా సాగాలంటే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం అందరికీ ఓటు హక్కును కల్పించిందన్నారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిందని పేర్కొన్నారు. ప్రజలు విశ్వాసంతో, ప్రలోభాలకు లొంగకుండా, ఒత్తిడికి లోనవకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా పట్టణ చౌరస్తాలో మానవహారాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకన్న, తహసీల్దార్ పార్థసారథి, అసిస్టెంట్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి: కమిషనర్ శ్రీనివాస్

చేవెళ్ల: ప్రజాస్వామ్యంలో ఓటు విలువ వెలకట్టలేనిదని, ఓటుహక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ కేంద్రంలో మంగళవారం ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లోక్‌సభ ఎన్నికలు–2024 స్వీప్‌లో భాగంగా ఓటు ఫర్ షురూ అనే తీమ్‌తో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి మార్కెట్ రోడ్డు ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని చెప్పారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాల్సిందేనని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం ఓటరు భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యం నడుస్తోందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓటరు జాబితాను పరిశీలించుకొని ఏమైనా తప్పులు పొరపాట్లు ఉంటే కూడా సరి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేందర్, ఎండీఓ వెంకయ్యగౌడ్, ఇన్‌స్పెక్టర్ ఎండీ అభిబుల్లాఖాన్, మేనేజర్ అంజన్‌కుమార్, ఏపీఓ నాగభూషణం, మున్సిపల్ కార్యాలయం సిబ్బంది, మెప్మా ఆర్‌పీఎస్ గ్రూప్ సభ్యులు, స్కూల్ విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యలో కుదరని సయోధ్య



గొడవకు దిగిన మహిళలు

కొందుర్గు: మండల మహిళా సమాఖ్యలో ఐకేపీ సిబ్బందికి, లీడర్ల మధ్య సయోధ్య కుదరడం లేదు. ఈ సందర్భంగా మంగళవారం మహిళా సమాఖ్య కార్యాలయంలోనే ఒకరిపై ఒకరు గొడవకు దిగారు. కొందుర్గు గ్రామానికి చెందిన చామంతి స్వయం సహాయక సంఘ సభ్యురాలు పరిమళ రూ.50వేలు రుణం కావాలని కోరడంతో సంఘం సభ్యులు సంఘంలో చర్చించి ఆమెకు రుణం ఇచ్చేందుకు తీర్మానం చేశారు. అయితే పరిమళకు రుణం ఇచ్చేందుకు గ్రామైక్య సంఘంలోనూ చర్చ జరిపి గ్రామ సంఘం తీర్మానంపై గ్రామైక్య సంఘం లీడర్లు, సీసీ సంతకం చేసి రుణం కోసం బ్యాంక్‌కు పంపాల్సి ఉంటుంది. కానీ గ్రామ సంఘం లీడర్ భారతమ్మ, సీసీ సరళ మధ్య సయోధ్య కుదరక పోవడంతో పరిమళకు సంబంధించిన రుణం మంజూరులో జాప్యం జరిగింది. ఈ విషయమై ఇటు సరళ, అటు భారతమ్మ మంగళవారం మండల మహిళా సమాఖ్యలో గొడవకు దిగారు. వీరి ఇరువురి మధ్య సయోధ్య కుదరకపోవడంతో సభ్యులు ఇబ్బంది పడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దేవరశెట్టి చంద్రశేఖర్, విజేందర్‌రెడ్డి

కందుకూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, వైస్ చైర్మన్ గోపిరెడ్డి విజేందర్ రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, తాము పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రానికి తెచ్చి విక్రయించాలన్నారు. వరి క్వింటాళ్లు ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 మద్దతు ధర చొప్పున కొనుగోలు చేయనున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని లబ్ధి పొందాలని వారు కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సురసాని శేఖర్‌రెడ్డి, నర్ల నర్సింహా, తీగల జగదీశ్వర్‌రెడ్డి, సత్తినేని వెంకటరాంరెడ్డి, సాధ పాండురంగారెడ్డి, రైతులు బక్క యాదయ్య, బడ్క సత్తయ్య, లాడె అంజయ్య, సీఈఓ నిమ్మ యాదగిరిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మకు పూజలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి భక్తులు బారులు తీరారు. మంగళవారం అమ్మవారికి ప్రీతి అయిన రోజు కావడంతో భక్తులు ఉదయం నుంచే దర్శనానికి బారులు తీరారు. అమ్మవారికి బోనం చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సత్యనారాయణ స్వామివ్రతాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు



ఉత్సవాల్లో పాల్గొన్న సచ్చిదానంద సరస్వతి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రీనగర్‌లోని శారదా లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ షష్ఠమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం శంకరాచార్య శ్రీస్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, భక్తులు ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో స్థానిక నాయకులు చల్లా బాల్‌రెడ్డి, ఆలయ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, కార్యనిర్వాహణాధికారి డాక్టర్ రవి శంకర్, ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.